**ఘనంగా ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పుట్టినరోజు వేడుకలు** 8



సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి...
ఎన్టీఆర్ - కృష్ణా
ఆదివారం 13 ఏప్రిల్ 2025
పేజీలు 8

# మంచినీటి సరఫరాకు అన్ని చర్యలు

- వేసవిలో ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకూడదు
- వచ్చే 70 రోజుల వరకు కొరత లేకుండా అన్ని చెరువులను పూర్తిగా నింపుతాం
- ప్రక్రియను పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తాం

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరాకు అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చే ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం మంత్రి సంబంధిత అధికారులతో కలిసి గూడూరు మండలం తరకటూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును, సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని పరిశీలించారు. తొలుత సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద మోటార్లతో మంచినీటిని పంపింగ్ చేస్తున్న ప్రక్రియను మంత్రి గమనించారు. ట్యాంకులో ఏ మేరకు నీరు ఉందని ఎన్ని మోటర్లతో వినియోగించారని, ఇంకా ఎన్ని రోజులు పడుతుందనే వివరాలు మంత్రి మునిసిపల్ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకంలో భాగంగా నిర్మించిన ట్యాంకులను, ఏరేటరు, హైడ్రాలిక్ ఫ్లోలెటర్, పంపు హౌస్లను పరిశీలించి అక్కడ ఉన్న నీటిని క్లోరినేషన్ సరిగా చేశారా లేదా అని స్వయంగా సీసాలోకి నీటిని తీసుకొని టెస్ట్ ట్యూబ్‌లో వేసి పరీక్షించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న మంచినీరులో ఎలాంటి తేడా ఉండకూడదని స్పష్టం చేస్తూ తప్పనిసరిగా పరీక్షించి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని మంత్రి మున్సిపల్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తరకటూరు మంచినీటి పథకం ద్వారా మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాల ప్రజలకు అవసరమైన తాగు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మచిలీపట్నంలోని పంపుల చెరువు, తరకటూరులోని సమగ్ర మంచినీటి పథకాన్నీ మంచినీటితో

2లో

## పీ-4తో పేదల జీవితాల్లో మార్పు

ఎమ్మెల్యే గద్దె రామమోహన్

వివరాలు 5లో...






## ఐ.ఎన్.టి.ఎస్.ఓ.లోకే శ్రీచైతన్య కృష్ణలంక విద్యార్థుల విజయ దుందుభి

వివరాలు 8లో



## తీర గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో త్రాగునీరు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తీర గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో తాగునీరు అందించారు. శనివారం కోడూరు మండలం పాదాలవారి పాలెం, శుక్రవారం ఇరాలి, పాలకాయ తిప్ప గ్రామాల ప్రజలకు ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు అందచేశారు. వేసవి నేపథ్యంలో తీర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తమ మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు

## ఏపీ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల

### రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత శాతం

### ఇంటర్ ఫలితాలు విడుదల చేసిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్

### ఇంటర్‌లో గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. ఇంటర్ ఫలితాలను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ resultsbie.ap.gov.inలో చూసుకోవచ్చు. లేదంటే వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చు. మనమిత్ర వాట్సప్ నంబర్ 9552300009కు హాయ్ మెసేజ్ చేసి ఫలితాలు నిమిషాల్లోనే పీడీఎఫ్ రూపంలో ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 10,17,102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గతంలో ఫలితాలను వెల్లడించేందుకు ప్రత్యేక కార్యక్రమం, హడావుడి చేయడం వల్ల కొన్నిసార్లు అనుకున్న సమయం కన్నా ఆలస్యంగా విడుదలైన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ సంవత్సరం ఎటువంటి హడావుడి లేకుండా సరిగ్గా చెప్పిన సమయానికి ఫలితాలను విడుదల చేశారు.

**అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు**

ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. మొదటి సంవత్సరం విద్యార్థులకు 70శాతం, రెండో సంవత్సరం విద్యార్థులకు 83 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలలో మెరుగుదల ప్రత్యేకంగా కనిపించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెండో సంవత్సరం ఉత్తీర్ణత శాతం 69%గా నమోదు కాగా, ఇది గత 10 ఏళ్లలో అత్యధికం కావడం విశేషం. మొదటి సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 47 శాతంగా ఉంది, ఇది గత పదేళ్లలో రెండవ అత్యధిక శాతం. ఈ విజయానికి విద్యార్థులు, జూనియర్ అధ్యాపకులు, విద్యా పురోగతికి కృషి చేసిన ప్రతి ఒక్కరి కఠినమైన శ్రమే కారణమని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు.

**జిల్లాల వారీగా ఉత్తీర్ణత శాతం**

ఇంటర్ తొలి ఏడాది ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. 82 శాతం ఉత్తీర్ణతతో గుంటూరు జిల్లాకు రెండోస్థానం, 81 శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్ జిల్లాకు మూడోస్థానం, 54 శాతం ఉత్తీర్ణతతో చిత్తూరు జిల్లాకు ఆఖరిస్థానం దక్కాయి.

**ఇంటర్మీడియట్ రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ తేదీలు**

మరోవైపు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ తేదీలను సైతం ప్రకటించారు. ఈనెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులు అప్లై చేసుకోవచ్చు. అదే విధంగా ఫెయిలైన విద్యార్థుల కోసం థియరీ సప్లిమెంటరీ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ సప్లిమెంటరీ పరీక్షలను వచ్చే నెల 28వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు జిల్లా కేంద్రాలలో మాత్రమే నిర్వహిస్తామని ప్రకటించారు. సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు.

## ఏపీకి చల్లని కబురు...

### వారం రోజులు పాటు వర్షాలు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఏపీలో ఎండలు మండిపోతున్నాయి. ఈ సమయంలో విశాఖపట్నం వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. రాష్ట్రంలో వారం రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కోస్తా, రాయలసీమ జిల్లాలలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాజస్థాన్ కోస్తాంధ్ర మధ్య ఉపర్తల ద్రోని కొనసాగుతుంది. హిమాలయ ప్రాంతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు మరో ద్రోని విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో రాగల వారం రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# మంచినీటి సరఫరాకు అన్ని చర్యలు



(మొదటిపేజీ తరువాయి)

నింపడానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద 450 హెచ్పి సామర్థ్యం గల అదనపు మోటార్లు తెప్పించి గత వారం రోజులుగా నీటిని పంపింగ్ చేయడం జరుగుతుందన్నారు. మరో 4 రోజుల్లో నీటిని తోడే ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యం 5.1 మీటర్లు కాగా ప్రస్తుతం 4.5 మీటర్లు మేరకు నీరు ఉందన్నారు. గతంలో వేసవిలో మంచినీటికి చాలా ఇబ్బంది పడుతుంటే ఇక్కడ 70 హెచ్పి మోటార్లకు అదనంగా మరో 460 హెచ్పి మోటార్లు, గదులు, ట్రాన్స్ఫార్మర్, ఇంజన్లు ఏర్పాటు చేశామన్నారు. మచిలీపట్నం నగరంలోని పంపు చెరువులో ప్రస్తుతం 8 అడుగుల వరకు నీరు ఉందని, 13 అడుగుల పూర్తి సామర్థ్యం వరకు నీటిని నిలువ చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. వచ్చే 70 రోజుల వరకు మంచినీటికి ఎలాంటి కొరత లేకుండా అన్ని చెరువులను పూర్తిగా నింపుకుంటున్నామన్నారు. ఈ ప్రక్రియను పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. జాతీయ రహదారి అధికారులతో కూడా మాట్లాడి తరకటూరు నుండి బందరు వరకు చుక్క నీరు కూడా లీకేజీ కాకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, శాసనసభ్యులు వడ్డీ రంగారావు చొరవతో ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని మంచినీటి కొరత రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఫిల్టర్ బెడ్లను 2.40 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరు చేశామని, టెండర్ల ప్రక్రియ నడుస్తుందని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కృష్ణా నది నుండి వాటర్ గ్రిడ్డు ద్వారా బందరు వరకు పైప్ లైన్ వేయించి ఇంటింటికి కుళాయి ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని, ఈ విషయం రాష్ట్ర ముఖ్య మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి త్వరలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు గమనించి భాగస్వాములు కావాలని కోరుతున్నామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మునిసిపల్ డి ఈ రాంప్రసాద్, ఏఈ రాజేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, జల వనరుల శాఖ ఏఈ హరీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు బండి రామకృష్ణ, ఇలియాస్ భాష,లంకే శేషగిరిరావు తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.



# జాతర ఘర్షణలో అరెస్ట్ అయిన వైసీపీ కార్యకర్తలు బెయిల్‌పై విడుదల

### జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలో సబ్ జైలులో గత నెల పెనుగంచిప్రోలు అమ్మవారి జాతర లో జరిగిన గొడవలో అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసిన వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువకుల ను మచిలీపట్నం సబ్ జైల్ నుంచి బెయిల్ పై పది కార్యకర్తల్ని విడుదల చేసిన అనంతరం ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ , జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, మచిలీపట్నం నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పేర్ని కిట్టు స్వయంగా దగ్గరుండి వారిని కలిసి స్వగ్రామం పెనుగంచిప్రోలు గ్రామానికి తీసుకువచ్చారు. తిరునాళ్లలో ఘర్షణ నేపథ్యంలో 16మంది వైఎస్సార్ సీపీ సాను భూతిపరులపై పోలీసులు నమోదు చేసిన అక్రమకేసులో పదిమందికి శుక్రవారం బెయిల్ మంజూరైంది. బెయిల్ పై విడుదలైన వారితో కలిసి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వర రావు శుక్రవారం రాత్రి పెనుగంచిప్రోలులోని డౌన్ సెంటర్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, మహానేత వైఎస్ రాజశేఖర్రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ పసుపు-కుంకుమ బండ్ల కార్యక్రమంలో ఘర్షణకు సంబంధించి పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై మాత్రమే కేసులు నమోదు చేశారన్నారు. ఈ ఘటనకు కారకులైన టీడీపీ వారిపై ఎటువంటి కేసు నమోదు చేయకపోవడం శోచనీయమన్నారు. టీడీపీవారే మొదట రెచ్చగొట్టే పాటలు, డైలాగ్లతో వైఎస్సార్ సీపీకి చెందిన వారిపై రాళ్లు, బాటిళ్లు, చెప్పులు విసిరిన వైనానికి తిరునాళ్లకు వచ్చిన జనమే సాక్ష్యమని గుర్తుచేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంటే కేవలం వైఎస్సార్ సీపీ వర్గీయులపైనే అక్రమంగా కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజమన్నారు. ప్రస్తుతం వేల్పుల అజ్ కూమార్, జొన్నలగడ్డ శ్రీహరి, శివరాం భొట్ల నాగ వెంకటేష్, చేని మహేష్, పసుపులేటి వరుణ్కుమార్, దారా గౌతమ్, సందిపాము సవన్కుమార్, దాసరి, నాగబాబు, కాకాని సంజయ్, షేక్ మస్తాన్ వలీ కిబెయిల్ వచ్చిందన్నారు. మిగిలినవారికి కూడా త్వరలోనే బెయిల్ వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అందరికీ బెయిల్ వచ్చాక వెళ్లి తమ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలుస్తామని చెప్పారు. కార్యకర్తలు, నాయకులందరికీ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘల అధ్యక్షులు మార్క పూడి గాంధీ, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు, న్యాయవాది సత్య, శ్రీనివాసరావు శివరాత్రి పృద్వి రాజ్, నియోజకవర్గ వాణిజ్య విభాగ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, జిల్లా బీసీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, నాయకులు కాకాని హరి, యానాల సురేష్, పొన్నం వెంకటేశ్వరరావు, ఉన్నం శ్రీనివాసరావు, నంబూరి రవి, గొట్టిపాళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# జాతర మహోత్సవంలో స్వచ్ఛంద సంస్థల సేవలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భక్తులు కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా వీరాజులుతున్న దివిసీమ కొంగు బంగారం గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మవారి వార్షిక జాతరను పురస్కరించుకొని పలు స్వచ్ఛంద సంస్థ లు ప్రజల దాహార్తిని తీర్చే అందుకు ఉచితంగా మజ్జిగ, మంచినీరు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా గత 11 సంవత్సరాలుగా జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కోర్టు సెంటర్ లో ఏర్పాటు చేసిన రాయపూడి చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రావు ప్రారంభించి మజ్జి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వేలాది భక్తుల దప్పిక తీర్చేందుకు జాతరలో మజ్జిగ పంపిణీ చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, టిడిపి అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు వీర మహిళ బచ్చు కృష్ణకుమారి లతోపాటు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన కూటమి నేతలు పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా మజ్జిగ పంపిణీ చేయగా, రాధాకృష్ణ మెడికల్ షాప్ ముందు బ్రాహ్మణ సమాజం సుగ్గుల బసవయ్య షాపు వద్ద ఆర్యవైశ్య సంఘం, లంకమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పులిహార ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. చింత చెట్టు సెంటర్లోని గజలక్ష్మి మెకానికల్ వర్క్స్ పెద్దబ్బాయి ఫౌండ్రీ వద్ద కవిత నాగేశ్వర శర్మ మిత్ర బృందం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. మొత్తం మీద స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు వారి వారి సేవలను వినియోగించారు.



### లంకమ్మ అమ్మవారి సన్నిధిలో
## భక్తబృందం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తబృందం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. శనివారం అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో భక్త బృందం ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం జరిగింది, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు, కోడూరు డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, అవనిగడ్డ సీఐ యువకుమార్, అవనిగడ్డ, కోడూరు ఎస్ఐలు శ్రీనివాస్, చాణక్య, అన్నదాన కమిటీ కూనపరెడ్డి పరుశురాం,టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు లుక్కా శ్రీనివాసరావు,గుడివాక నరహరి,యలవర్తి ఆది తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో భక్తులకు పానకం పంపిణీ చేసిన చైల్డ్ హుడ్ సంస్థ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జాతర ఉత్సవాల సమయంలో భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు మరువలేనివని ముఖ్యంగా చైల్డ్ హుడ్ సేవా సంస్థ భక్తుల దాహార్తిని తెచ్చేందుకు పానకం పంపిణీ చేయడం అభినందనీయమని అవనిగడ్డ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. శ్రీ లంకమ్మ తల్లి వార్షిక జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని చైల్డ్ హుడ్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పానకం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి రాత్రి ఒంటిగంట వరకు లంకమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు పానకం పంపిణీ చేస్తున్నారు.అందులో భాగంగా ఐదవ సంవత్సరం చైల్డ్ హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాస్. సుధాకర్ ఆలయ సిబ్బంది దామర్ల ఏడుకొండలు చైల్డ్ హుడ్ ట్రెజరర్ కుందేటి రత్నాకర్. సభ్యులు అన్నపరెడ్డి కృష్ణ. సామర్ల మల్లికార్జునరావు. జమ్మలమడక భాస్కర్. దామర్ల రాజా. గంటా శీను. కమ్మిలి శ్రీను. రాంప్రసాద్, హనుమంతు శ్రీను లతోపాటు పలువురు పాల్గొన్నారు.

# కోలాహలంగా శ్రీ లంకమ్మ తల్లి జాతర







**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా దివిసీమ వాసుల కొంగుబంగారమైన శ్రీ లంకమ్మ తల్లి జాతర శనివారం ఉదయం నుండి కోలాహలంగా ప్రారంభమైంది. జాతరను పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుండి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. గ్రామదేవత లంకమ్మతల్లి జాతర సందర్భంగా గత ఏడు రోజుల నుండి అమ్మవారు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పసుపు, కుంకుమ, చీర, సారే అందుకొని శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారి జాతర ప్రారంభం కాగా అమ్మవారి కి ఘటం బిందె మొక్కుబడులు తీర్చుకునేవారు ఘటం బిందెను నెత్తిన పెట్టుకొని గారెల దండ మెడలో వేసుకుని రంగులు చల్లుకుంటూ డప్పు కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు.కొంతమంది భక్తులు కేవలం వారి కుటుంబ సభ్యులతో ఎలాంటి సందడి లేకుండా సాదాసీదాగా మొక్కుబడులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకపోతులు మొక్కుబడిగా గుడి చుట్టూ తిప్పడం జరిగింది. అమ్మవారి గ్రామోత్సవంలో, ఆలయానికి చేరే సమయంలో భక్తులు పెద్ద ఎత్తున కత్తులతో కొట్టుకొని వారి కి అమ్మవారి పై ఉన్న భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి శ్రీవిద్య ఆధ్వర్యంలో సి ఐ యువకుమార్ పర్యవేక్షణలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నసంతర్పణ నిర్వహించగా ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాస్ భక్తులకు కావలసిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. జాతరను పురస్కరించుకొని ఆలయ ఆవరణలో లంకమ్మ అమ్మవారి ప్రతిమను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## వర్ల్‌పూల్ నుంచి భారతదేశపు అత్యంత వేగవంతమైన కన్వర్టిబుల్ రిఫ్రిజిరేటర్లు




**విజయవాడ మేజర్ న్యూస్ :** గృహోపకరణాలలో అగ్రగామి వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా, భారతదేశపు వేగవంతమైన కన్వర్టిబుల్ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రకటించింది. వర్ల్ పూల్ ఇంటెలిఫ్రెష్ ప్రో శ్రేణి టాప్ మౌంట్ (ఫ్రాస్ట్-ఫ్రీ) రిఫ్రిజిరేటర్లు అదనపు ఆహారాన్ని స్టోర్ చేసుకునేందుకు తెలివైన మార్గాన్ని అందిస్తాయి. ఇది దాని ఫ్రీజర్‌ను కేవలం 10 నిమిషాల్లోనే ఫ్రిజ్‌గా మారుస్తుంది. వర్ల్‌పూల్ ఇంటెల్లిఫ్రెష్ ప్రో శ్రేణి కన్వర్టిబుల్ టాప్ మౌంట్ (ఫ్రాస్ట్-ఫ్రీ) రిఫ్రిజిరేటర్లు 235లీ నుంచి 327లీ వరకు శక్తి రేటింగ్‌తో (2 స్టార్‌ల నుంచి 3 స్టార్‌ల వరకు) అందుబాటులో ఉన్నాయి. ఇది ప్రముఖ గృహోపకరణ దుకాణాలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాల్లో కొనుగోలు చేసుకోవచ్చు. ఈ రిఫ్రిజిరేటర్లు రూ.35000 నుంచి ప్రారంభమయ్యే ధరతో, వర్ల్‌పూల్ వెబ్‌సైట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ రిటైలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి.

## ఘనంగా మారెమ్మ తల్లి జాతర



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడలో గ్రామ దేవత శ్రీ మారెమ్మ తల్లి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. శనివారం అమ్మవారిని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుడివాక శివరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఐటీ కో-ఆర్డినేటర్ సూదాని నందగోపాల్, సూదాని సత్యనారాయణ, శీరం మురళీ కృష్ణ, సూదాని దుర్గా, సూదాని సూర్య ప్రకాష్, చీడేపూడి చరణ్, సూదాని నాంచారయ్య, శీరం ఉపేంద్ర, సూదాని సతీష్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సత్తెమ్మ అమ్మవారి రథోత్సవం



**నందిగామ, ఏప్రిల్ 12, మేజర్ న్యూస్:** మండలం లోని అంబర్పేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఆలయ ఈవో గెల్లి హరి గోపీనాథ్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాంచాల మాధవరావు సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు నందిగామ సుబ్బారావు శాస్త్రి, కోటేశ్వర శాస్త్రి టీటీడీ వేద పండితులు దుర్భాకుల రఘునాథ శర్మ అవధాని ఆధ్వర్యంలో శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారికి విశేష అర్చనలు, కుంకుమార్చనలు ఖడ్గమాల మూల మంత్ర హోమాది క్రతువులు పూజలు నిర్వహించారు. సాయంత్రం పూలు విద్యుత్ దీపాలతో అలంకరించిన రథముపై మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారిని ఏర్పాటు చేసి పాల్గొన్నారు.



# పీ-4తో పేదల జీవితాల్లో మార్పు







**ప్రతి కుటుంబ ఆదాయాన్ని పెంచడానికి చర్యలు**

**11వ డివిజన్ లో రూ.50 వేలు విలువ చేసే ప్లాట్ ఫారం రిక్షా, తోపుడుబండ్ల ఉచితంగా అందజేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్**

**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉగాది సందర్భంగా ప్రవేశపెట్టిన పీ-4 ద్వారా రాష్ట్రంలోని పేదల జీవితాల్లో మార్పు వస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ చెప్పారు. శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్ లోని పటమట హైస్కూల్ రోడ్డు, రైతు బజార్ ఏరియాలలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. ప్రజా సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అనంతరం డివిజన్ లోని నిరుపేద కుటుంబా లకు చెందిన ముగ్గురు పార్టీ కార్యకర్తలకు రూ.50 వేలు విలువ చేసే ఫ్లాట్ ఫారం రిక్షా, రెండు తోపుడు తోపుడు బండ్లును గొర్రెల ఆదిలక్ష్మి, దేవరకొండ శ్రీను, గొర్రెల అచ్చయ్య లకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తన సొంత నిధులతో కొనుగోలు చేసి వీరికి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పీ-4 ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేదవారికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. పేద కుటుంబాల ఆదాయ వనరులను పెంచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్క కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారుచేసే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటు న్నారని చెప్పారు. పారిశ్రామికవేత్తల సహకారంతో పేదలను అభివృద్ధి చేస్తు న్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిరోజు రాష్ట్రంలోని గ్రామాల్లో ఏ విధమైన సెక్యూరిటీ లేకుండా పర్యటిస్తూ పేదలతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటున్నారని చెప్పారు. నూజి వీడు, ఆగిరిపల్లి,మంగళగిరి వంటి గ్రామాల్లో పర్యటించి అక్కడి చేనేత కుటుం బాలు, చిరు వ్యాపారులతో మాట్లాడి వారి ఆదాయ వనరులను పెంచడానికి ఏమి చేయాలో వాటిని చేస్తున్నారన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనల సందర్భంగా ప్రజలను రోడ్లపైకి రానివ్వకుండా ఆయన వెళ్లే దారిలో పరదాలను కట్టి చెట్లను నరికేసి, చిరు వ్యాపారులను తొలగించి, ప్రజలను చాలా ఇబ్బందులకు గురి చేసే వారని చెప్పారు. అందు వల్లనే గత ఎన్నికల్లో ఆయనకు రాష్ట్రంలోని ప్రజలు జగన్ కు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలు సందర్భంగా ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా పర్యటిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారని చెప్పారు. పీ-4 ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని, మహిళలు ఈ సంఘాలలో సభ్యులుగా చేరి బ్యాంకుల నుంచి లక్షల రూపాయల రుణాలను తీసుకొని ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా చేసుకున్నారని చెప్పారు. పేదల సంక్షేమం తెలుగుదేశం పార్టీ ద్వారానే సాధ్యమని తూర్పు నియోజక వర్గం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.

పార్టీ డివిజన్ అధ్యక్షుడు కోనేరు రాజేష్ మాట్లాడుతూ పేదల జీవనోపాధి కోసం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తన సొంత నిధులతో ప్లాట్ ఫారం రిక్షా, తోపుడు బళ్లను కొనుగోలు చేసి ఉచితంగా వారికి అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీరు జీవనోపాధి చేసుకుని కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో ఈ విధంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సహాయకార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలడుగు ప్రసాద్, జాస్తి సురేష్, కొలసాని నాగమణి, గొల్లపూడి గేశ్వరరావు, దేవరపల్లి ఆంజనేయులు, పామర్తికిషోర్, బంగారు మురళి, కాటూరి సుబ్రహ్మణ్యం, యలమంచిలి ప్రసాద్, సుబ్రమణ్యం, వల్లూరు సాంబశివరావు, వి.సుగుణ, కె.మాలతి తో పాటుగా కూటమి పార్టీలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మాధ్యమిక విద్యా ఫలితాలు అనేవి మధ్యస్థ ఫలితాలే కానీ......**

# అంతిమ ఫలితాలు కావు



**జగ్గయ్యపేట, ఏప్రిల్ 12, మేజర్ న్యూస్ :** నేటి విద్యా వ్యాపార ప్రపంచంలో మార్కుల పోటీ వల్ల విద్యార్థులు ఎన్నో ఆశలతో ఫలితాల కోసం ఎదురుచూస్తారు. కొన్ని సందర్భాల్లో ఫలితాలు అంచనాలకు భిన్నంగా వచ్చినప్పుడు విద్యార్థుల్లో నిరాశ,నిస్పృహ, భయం కనిపించవచ్చు. ఈ సందర్భాల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు సానుకూలంగా ఈ క్రింద విధంగా స్పందించినట్లయితే మానసిక గందరగోళం నుండి సునాయాసంగా బయటపడవచ్చు అని సైకాలజిస్ట్ జిల్లా తిరుపతిరావు అన్నారు. ఇంటర్ ఫలితాల విడుదల గురించి ఆయన ఈ విధంగా మాట్లాడుతూ శ్లోకం - భగవద్గీత 2:47 కర్మణ్యేవాధికారస్తే.....మా ఫలేషు కదాచన. మా కర్మఫలహేతుర్భూ.... మా తే సంగోస్త్వకర్మణి. భావం:నీకు కర్తవ్యానికి మాత్రమే అధికారం ఉంది.ఫలితాలపై నీకు హక్కు లేదు ఫలితాల కోసమే పని చేయవద్దు

ఫలితం రాకపోతుందనే భయంతో పని చేయకుండా వదలవద్దు అని ఉదాహరణకు పరీక్షకు కష్టపడిన విద్యార్థి ఫలితాలను నియంత్రించలేడు. కానీ తన కృషిలో గర్వంగా ఉండాలి - ఎందుకంటే జీవితానికి మార్కులు ఒక్కసారి, కానీ అవకాశాలు ఎన్నో సార్లు వస్తాయి అని కాబట్టి విద్యార్థులు ఈ సూచనలు పాటించి చూడండి అని అన్నారు.

1.ఫలితాలు మీ విలువను నిర్ణయించవు.. వ్యక్తిత్వం మార్కులతో కాదు, మన ఆలోచనలు, శ్రమతో అంచనా వేయబడుతుంది. 2. ఆశలు తారుమారు కావొచ్చు -కాని ఆశలు వదలవద్దు ఈసారి వచ్చిన ఫలితం జీవితాంతపు తీర్పు కాదు. 3. బాధను నొక్కిపెట్టవద్దు - వ్యక్తపరచండి. మీ భావాలను తల్లిదండ్రులతో, నమ్మకమైన మిత్రులతో పంచుకోండి. 4. కష్టపడిన వ్యక్తి ఎప్పుడూ తిరగబడడు. ఈ ఫలితం ఓ అడ్డంకి మాత్రమే - ఓ కొత్త గమ్యం మొదలు కావచ్చు. 5. మీ భవిష్యత్తు ఇంకా మీ చేతుల్లోనే ఉంది. ప్రైవేట్ రంగం, ఉద్యోగాలు, వ్యాపార విభాగం, అనేక పోటీ పరీక్షలు, ప్రభుత్వరంగ ఉద్యోగాలు ఇంకా మార్గాలు ఎన్నో ఉన్నాయి అని తెలిపారు. అలాగే తల్లిదండ్రులకు కూడా పలు సూచనలు చేశారు. 1. ప్రేమతో స్పందించండి. ఈ సమయం లో పిల్లలకు మీ సానుభూతి అత్యంత అవసరం. 2. పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోండి. ఫలితాలవల్ల వారిలో భావోద్వేగాలు ఎలా పనిచేస్తున్నాయో గమనించండి. 3. పోలికలు వద్దు - పరిపూర్ణత కాదు లక్ష్యం. ఒక్కొక్కరి బుద్ధి, బలం వేరు. అందుకే ఎవరి ప్రయాణం వాళ్లది. 4. ధైర్యం, మద్దతు ఇవ్వండి. ఒత్తిడి కాదు, నమ్మకం వారిని ముందుకు నడిపిస్తుంది. 5. ఓ ఫలితం కాదు, ఓ జీవితం ముఖ్యం జీవితంలో వందల అవకాశాలు ఉన్నాయి - ఈ ఒక్కటి కాదు అన్న విషయాన్ని గుర్తించండి అని అన్నారు. ముఖ్యంగా ఈ సమయంలో పిల్లలు చీకట్లో ఉన్నట్లుంటారు మీ ప్రేమ, నమ్మకం, ఓర్పే వాళ్లకు వెలుగుగా మారుతుంది. వాళ్లను నమ్మండి, మీరు తోడుంటే వారు జీవితాన్ని గెలుస్తారు అని హితవు పలికారు.

# గోశాలలో ఆవులు చనిపోయినట్టు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం

**ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గో మరణాలపై భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారం మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర అని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టిటిడిపై భూమన కరుణాకర్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు.అదొక నల్ల రాయి దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుంది" అంటూ గతంలో వెంకటేశ్వర స్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్ రెడ్డి. నేను నాస్తికునైన స్వయంగా కరుణాకర్ రెడ్డి ప్రకటించుకున్న విషయం వాస్తవం. గోశాలలో 100 ఆవులు చనిపోయినట్టు కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.గోశాలలోని ఆవులు వృద్ధాప్యం డెలివరీ సమయంలో వ్యాధులతో నెలకు సగటున పది ఆవుల వరకు మృత్యువాత పడుతుంటాయి.ఇవి గత ఐదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టం అవుతుంది.గోశాలలో 250 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణకు సంక్రమంగా చూసుకుంటే టీడీపీ పట్టించుకోవడమే తప్పుడు ప్రచారం చేస్తుంది. మత విద్వేషాలు రెచ్చగొట్టుతున్నందుకు, టిటిడి ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తిగారు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామకృష్ణ ప్రసాద్,యార్లగడ్డ సీతారామయ్య, వేముల కృష్ణారావు, పామర్తి నరేష్,వల్లూరి రాంబాబు,జిల్లా సగర సాధికారక కన్వీనర్, తాడిశెట్టి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం సభ్యత్వం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని, ప్రతి కార్యకర్తకు బలం, బలగం టిడిపి సభ్యత్వమేనని కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు, పెదపట్నం, గ్రామాలలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని క్లస్టర్ ఇంచార్జి శేషగిరితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 4 కోట్ల మంది ఉంటే అందులో కోటి మందికి పైగా టిడిపి సభ్యత్వాలు కలిగి ఉండడం గొప్ప విషయం అన్నారు.టిడిపి సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు సభ్యత్వ కార్డు అందించేవిధంగా తెలుగుదేశం పార్టీ కార్యాచరణ రూపొందిస్తుందని, అధిక మొత్తంలో సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం ఇచ్చే విధంగా సభ్యత్వ కార్డును రూపొందించారన్నారు.పార్టీ ఎల్లవేళలా కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. యువ నాయకులు నారా లోకేష్ కార్యకర్తలు అందరికీ అండదండలుగా ఉంటా రన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు పొందిన కార్యకర్తకు, ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల ప్రమాద బీమా చెల్లించేందుకు రూప కల్పన చేసింది పార్టీ యువ నాయకులు మంత్రి నారా లోకేష్ అని అన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలన్నారు. ఎం. నాగేశ్వర రావు,జి. రవి, డి. విజయ్ కుమార్, సిహెచ్ సత్యనారాయణ, పి. రాము, బి. ఏడుకొండలు, ఎం.కృష్ణ, కె. కాంతారావు, మరియన్న,శ్రీనివాస రావు,కె. శ్రీనివాస రావులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రామాల్లో దాతలు ముందుకు వస్తే గ్రామాల రూపురేఖలను మార్చవచ్చు



**గన్నవరం, ఏప్రిల్ 12, మేజర్ న్యూస్ :** గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. గన్నవరం మండలం బి. బి.గూడెం గ్రామంలో దాతల సహకారంతో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి శనివారం సాయంత్రం యార్లగడ్డ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీబీ గూడెం గ్రామపంచాయతీ నిర్మాణానికి గ్రామస్తుల అందించిన సహకారం మరువలేనిది అన్నారు. పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి మూడు సెంట్ల భూమిని ఉచితంగా ఇచ్చిన వేమూరి గోపాలరావు కుమారులను ఈ సందర్భంగా యార్లగడ్డ అభినందించారు. పంచాయతీ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన డాక్టర్ బి.ఆర్.ఎల్.ప్రసాద్ రూ.20 లక్షలు విరాళం ఇవ్వగా మరో రూ.20 లక్షలు గ్రామస్తులు విరాళాలు సమకూర్చుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇదే రీతిగా అన్ని గ్రామాల్లోనూ దాతలు ముందుకు వస్తే గ్రామాల రూపురేఖలను మార్చవచ్చని అభిప్రాయపడ్డారు. అన్ని పనులు ప్రభుత్వమే చేయాలంటే కొంతమేర జాప్యంతో పాటు నిధుల కొరత ఉంటుందని దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ప్రభుత్వ పరంగా కావలసిన అనుమతులు మంజూరు చేయడంతో పాటు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని యార్లగడ్డ తెలిపారు. అధ్వానంగా మారిన గన్నవరం ఆగిరిపల్లి రహదారి లో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను చూసి ఈ రహదారి పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించిన సంగతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు తమ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆయన వివరించారు. వివిన్ పురం కాలనీలో రూ. 27 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొమ్మరాజు సుధీర్, గ్రామ సర్పంచ్ దొప్పలపూడి విజయలక్ష్మి, ఎంపీటీసీ మోరం నాగరాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి శివ నాగరాజు, నాయకులు బోయపాటి బసవపూర్ణయ్య (నల్లబాబు) బోయపాటి మురళీకృష్ణ (బుల్లియ్య ), తమ్మిశెట్టి నాగ మురళీకృష్ణ, కోటగిరి వరప్రసాద్, దొంతు చిన్న, తెలుగు యువత నాయకులు పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం, కాసర్నేని రంగబాబు, మద్దినేని వెంకటేశ్వరరావు, దాతలు, స్థానికులు పాల్గొన్నారు.

## గొట్టుముక్కలలో కుక్కల స్వైర విహారం

### ఆరుగురికి గాయాలు



**కంచికచర్ల ఏప్రిల్ 12 మేజర్ న్యూస్ :** గొట్టుముక్కల గ్రామంలో కుక్కల స్వైరవిహారంతో ఆరుగురు పైగా తీవ్ర గాయాల య్యాయి. గత మూడు రోజులుగా ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు దర్శనమిస్తున్నాయి. పెద్దలు పిల్లలు అనే తారతమ్యం లేకుండా కుక్కలు ఎగబడుతున్నాయి. ప్రజలు వీధులలోకి రావాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఈ కుక్కలు దాడులు ఎక్కువయ్యాయి. శుక్రవారం, శనివారం రెండు రోజులలో కుక్కల దాడులకు ఆరుగురు గాయపడటం పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం అవుతుంది. దీంతో ఇళ్లలో నుండి ఎవరు బయటకు రాని పరిస్థితి నెలకొని ఉంది. ప్రతి ఒక్కరూ కుక్కల గురించి ఆందోళన చెందుతున్నారు.అధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకొని గ్రామంలో కుక్కల భారీనుండి రక్షించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నాగార్జున నగర్ ఈఎస్ఎల్ఆర్ మరమ్మతులు చేసిన అధికారులు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** మూడవ డివిజన్, నాగార్జున నగర్ ఎలివేటెడ్ లెవెల్ సర్ఫేస్ రిజర్వాయర్ (ఈఎస్ఎల్ఆర్) షట్టర్ పడిపోయినందున తాగునీటి సరఫరాకు శనివారం సాయంత్రం అంతరాయం కలిగినప్పటికీ అధికారులు సత్వరమే మరమ్మతులు పూర్తిచేసి, ఆదివారం ఉదయం తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పునరుద్ధరించారని నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

## విద్యుత్ అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

### 205 సర్వీసులకు అదనపు లోడు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గృహ విద్యుత్ వినియోగదారులు తమ వాడుకుంటున్న అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50% రాయితీ కల్పిస్తుందని, విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈ ఈ డి కృష్ణ నాయక్ చెప్పారు.మండలంలో 205 సర్వీసులకు అదనపులోడు ఉన్నట్లుగా గుర్తించామని. శుక్రవారం సాయంత్రం వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాలలోని గృహ వ్యాపార సముదాయాలకు సంబంధించి 2100 సర్వీసులను తనిఖీలు చేయడం జరిగిందని విజిలెన్స్ వారి ఆధ్వర్యంలో 28 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. గృహ విద్యుత్ వినియోగదారులు తమ వాడుకుంటున్న అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50% రాయితీ కల్పిస్తుందన్నారు. ఈ స్కీంలో ఒక కిలో వాట్కు 2250 రూపాయలకు బదులుగా కేవలం 1250 కడితే సరిపోతుందన్నారు అదేవిధంగా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు గడువు 15 రోజులు మాత్రమేనని బిల్ ఇచ్చిన 15 రోజులలో బిల్లు చెల్లించిన యెడల తదుపరి నెలలో వచ్చే బిల్లులో సర్ చార్జీ విధించబడుతుందని వినియోగ దారులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఇ ఎన్ సుబ్రహ్మణ్యేశ్వర రావు చల్లపల్లి ఉయ్యూరు డి ఈ లు శివ నాగేశ్వరరావు. జి హేమ కుమార్ ఉయ్యూరు డివిజన్లోని అన్ని సెక్షన్ల ఏఈలు జేయులు ఎల్ఐలు పాల్గొన్నారు.

## మామిడి తోటలను పరిశీలించిన జిల్లా ఉద్యాన అధికారి



**రెడ్డిగూడెం, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నాగులూరు, రంగాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో అకాల వర్షాలకు, గాలులకు నష్టపో యిన మామిడి తోటలను జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ పర్యటించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు భరోసా నింపుతూ ఇంతకు ముందు మనకు పండు రాలడం కు ఇన్పుట్ సబ్సిడీ ఉండేది కాదు అని ఈ ప్రభుత్వం వచ్చాక దీనికి కూడా ఇన్పుట్ సబ్సిడీ ప్రకటించి రైతులు నష్టపోకుండా చేస్తుంది అని తెలిపారు. రాలిన మామిడి పండ్లు వెంటనే మార్కెట్ కు ఎంతోకొంత రేటుకు అమ్ముకోవాలి అని, అలాగే ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇన్పుట్ సబ్సిడీకి కూడా సిఫార్సు చేసి పంపుతామని అధైర్య పడొద్దు అని రైతులకు భరోసా ఇచ్చారు. ఉద్యాన అధికారులకు కూడా ఈపంట అధారంగా నష్ట అంచనా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి బి. నరేంద్ర కుమార్, హెచ్ఈఓ శ్రీహరి, గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లంకమ్మ తల్లి జాతర మహోత్సవం





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ తల్లి అమ్మవారి దేవాలయ వార్షిక జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ వాసు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అర్చకులు ఆయనను సత్కరించి అమ్మవారి ఆశీస్సులు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఘంటసాల ఏఎంసీ చైర్ పర్సన్ తోట కనకదుర్గ, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, జిల్లా కర్రసాము అసోసియేషన్ అధ్యక్షులు సింహాద్రి పవన్, జనసేన అవనిగడ్డ, కోడూరు టౌన్ అధ్యక్షులు రాజనాల వీరబాబు, కోట రాంబాబు, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు బండే రాఘవ, సిద్ధినేని అశోక్ నాయుడు, బచ్చు శ్రీహరి, మండలి సుధీర్, గుడివాక నరహరి, తండు గంగాధర్, తుంగల ప్రవీణ్ పాల్గొన్నారు.





## బక్కమ్మ భౌతిక గాయానికి ఎమ్మెల్యే ఘననివాళి

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** రాణిగారితోటలో 18వ డివిజన్కి చెందిన వేముల బక్కమ్మ స్వర్గస్తు అయినారు. వారి భౌతిక గాయానికి విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ మోహన్ పూలమాల వేసి నివాళులర్పిస్తున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 18వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేముల దుర్గారావు వారి నాయనమ్మ వేముల బక్కమ్మ స్వర్గస్తులు అయినారు. వారు నూట తొమిది సంవత్సరాలు జీవించడం జీవితంలో చాలా మంది ఉంటారు అన్ని సంవత్సరాలు జీవించారు అంటే ఆమహోతల్లి చేసుకున్న పుణ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేముల దుర్గారావు అంబటి కాశి, మర్రి వెంకటరమణ,పత్తి రామారావు, దేవల్ల శ్రీను వేముల వాసు తారక్, ఏ ఖాళీ, జే బాల ,సిహెచ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటేషన్ పై పంచాయితీ కార్యదర్శిగా తోట శ్రీనివాసరావు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ పంచాయతీ కార్యదర్శిగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వుల మేరకు డిప్టేషన్ పద్ధతిపై చల్లపల్లి మండలం నడకుదురు గ్రామపంచాయతీ బాధ్యతల నుండి రిలీవ్ అయి శనివారం అవనిగడ్డ పంచాయతీ సెక్రటరీగా విధుల్లో జాయిన్ అయ్యారు. విధుల్లో జాయిన్ అయినా తోట శ్రీనివాసరావు సర్పంచ్ ఉమా తో పంచాయితీలోని సమస్యలపై దృష్టి పెట్టి వెంటనే మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపే అందుకు చర్యలు చేపట్టి పనులను పర్యవేక్షించి నూతనంగా ఒక బోరు ఏర్పాటుకు పనులకు శ్రీకారం చుట్టారు,

# ఘనంగా ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పుట్టినరోజు వేడుకలు

## భారీగా శుభాకాంక్షలు తెలియజేసిన కూటమి నేతలు, కార్యకర్తలు అధికారులు







**నందిగామ, ఏప్రిల్ 12, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ శాసనసభ్యులు తంగిరాల ప్రభాకర రావు ఘాట్ వద్దకు కుటుంబ సభ్యులతో కలసి చేరుకొని తంగిరాల ప్రభాకర రావుకి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. నందిగామ పట్టణం కాకాని నగర్ కార్యాలయంలో భారీగా తరలివచ్చి కూటమి నేతలు, కార్యకర్తలు తంగిరాల సౌమ్యకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ శాఖల అధికారులు ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐ.ఎన్.టి.ఎస్.ఓ.లోకే శ్రీచైతన్య కృష్ణలంక విద్యార్థుల విజయ దుందుభి







**కృష్ణలంక మేజర్ న్యూస్ :** స్థానిక విజయవాడ శ్రీచైతన్య కృష్ణలంక శాఖలో ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలలో ప్రతిభను కనబరిచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మహాలక్ష్మి మాట్లాడుతూ ఐ.ఎన్.టి ఎస్.ఓ పరీక్ష పిల్లల జ్ఞానాన్ని పరీక్షించి, పోటీతత్వాన్ని పెంచుతాయి. ఉన్నత విద్యకు మార్గదర్శకం, అభ్యాస సామర్థ్యాలు, ప్రతిభను నిరూపించుకోవడానికి చక్కని నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి మంచి సోపానాలు. పిల్లలు సర్వతోముఖా భివృద్ధికి దోహదపడతాయి. మ్యాథ్స్ ఒలింపియాడ్, ఇంగ్లీష్ టాలెంట్ సెర్చ్, సైన్స్ ఒలింపియాడ్, సైకోమెట్రిక్ మొదలైన వాటి ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో విజయం సాధించేందుకు సహకరిస్తుందన్నారు. ఐ.యన్.టి ఎస్ ఒలింపియాడ్ లెవల్-2 పరీక్షల్లో మొదటి బహుమతి ఎ.భవిష్య (4వ తరగతి) రెండవ బహుమతి టి.మిథిల్ శ్యామ్ (7వ తరగతి), మూడవ బహుమతి కె.మనన్య (8వ తరగతి) ఐదవ బహుమతి వి.తేజస్విని (5వ తరగతి) కె.య శ్విత, యు.మోహిత అక్షయ (6వ తరగతి) బహుమతులు సాధించారు. సుమారు 130 మంది విద్యార్థులు ఒలంపియాడ్‌ల్లో ఎంపికయిన వారికి బహుమతులు మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈజియం యం.మురళి కృష్ణ, ఆర్ఐ జె.రాజేష్ బాబు, కోఆర్డినేటర్ సిహెచ్ సురేష్ బాబు, ఇన్చార్జులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఇంటర్ పరీక్షల్లో శ్రీ శ్రీనివాసా గ్రావిటీ విద్యాసంస్థలు ప్రభంజనం



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో శ్రీ శ్రీనివాసాస్ గ్రావిటీ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థ ఛైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు తెలి పారు. ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు 94 శాతం ఉత్తీర్ణత సాధించారని, విద్యార్థులు, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ఫలితాలు సాధించా మన్నారు. శనివారం ఉదయం ఫలితాలు విడుదల అనంతరం మొగల్రాజపురంలోని శ్రీ శ్రీనివాసాస్ గ్రావిటీ విద్యాసంస్థల్లో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్స రంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేసి, మిఠాయిలు తినిపిం చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం తమకు గర్వకారణం అన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో కె.డింపుల్ 470కి 465 మార్కులు, ఎం.సంజన, కె.మాధవ ప్రసాద్, జి.అభినవ్, కె.దర్శన్ 470కి 464 మార్కులు సాధించారని చెప్పారు. 460పైన మార్కులు 46 మంది విద్యార్థులు. 450కి పైగా మార్కులు 85 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అలాగే జూనియర్ బైపీసీలో సిహెచ్ మహాలక్ష్మి 440కి 433 మార్కులు, 420 మార్కులుపైన 8 మంది సాధించారన్నారు. సీనియర్ ఎంపిసిలో రవికిరణ్ 1000 మార్కులకు 988 మార్కులు, పి.లిపి, ఎల్.హాసిని, కె.మహేష్ 1000కి 987 మార్కులు, కె.ప్రజ్ఞ 1000కి 983 మార్కులు, 980 పైన మార్కులను 12 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. సీనియర్ బైపీసీలో షబానా 1000కి 983 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, కళాశాలలో మంచి కరికులంతో బోధనను అందించారని, ఐపీఈతో పాటు ఆబ్జక్టివ్‌కు కూడా సమ ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొంటూ అందరి సహకారం, ప్రోత్సాహంతో అత్యుత్తమ మార్కులు సాధించామని పేర్కొన్నారు.





## రాష్ట్ర డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మోపిదేవి లోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర మర్యాదపూ ర్వకంగా కలిశారు. అనంతరం ఎస్పీ డిజిపితో కలిసి పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడమే లక్ష్యంగా కొల్లు ఫౌండేషన్ పని చేస్తోందని రాష్ట్ర గను లు, భూగర్భ వన రులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, జనసేన ఇంఛార్జి బండి రామకృష్ణతో కలిసి మచిలీపట్నం కోనేరు సెంటర్లో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి సంవత్సరం వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే కొల్లు ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, ఇలాంటి సేవా కార్యక్రమాల నిర్వహణతో ఆత్మ సంతృప్తి కలుగుతోం దన్నారు. గతంలో అన్న క్యాంటీన్లు నిలిపివేసినపుడు మచిలీపట్నంలో అన్న దానం కార్యక్రమాలు నిర్వహించాం. అదే సమయంలో యువ కెరటాలు, ఐ క్యాంప్, మెడికల్ క్యాంపుల నిర్వాహణతో ప్రజా సేవలో కొల్లు ఫౌండేషన్ నిత్యం పని చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

## దేవినేని ఉమా కుమారుని నిశ్చితార్థ వేడుకలో సౌమ్య



**నందిగామ, ఫిబ్రవరి 12, మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు కుమారుని వివాహ నిశ్చితార్థ వేడుక విజయవాడ ఏ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరై కాబోయే నూతన వధూవరులు నిహార్, నర్మదలకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు పాల్గొన్నారు.



18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు, ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999